సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం, 8, జనవరి, 2024



చెరువుకు రక్షణ కరువు

గండేడ్ మండలం నల్కర్‌పేట సమీపంలోని పోతులవాని చెరువు కబ్జాకు గురవుతోంది.

వివరాలు 8లో ▸



..బ్రహ్మోత్సవ శోభ

సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతోంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.2 /22.3

ఉదయం వేళ మంచు కురుస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఐక్యతతోనే హక్కుల సాధన



అయిజ: ఆర్యవైశ్యులు ఏకతాటిపైకి రావాలని.. ఐక్యతతోనే హక్కులు సాధించుకోవచ్చని ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి బాల స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని రాజాపురంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్య, వైద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని, ఐకమత్యంతో ముందుకు సాగితే హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు రాణించాలన్నారు. అనంతరం రాజాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గద్వాల పట్టణ అధ్యక్షుడు బిలకంటి రాము, రమేష్‌శెట్టి, సంతోష్, నాయకులు శ్రీనివాసులు, బాబీషయ్య శెట్టి, ఆంజనేయులు శెట్టి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబదేవి సన్నిధిలో ప్రభుత్వ విప్



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాన్ని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. ముందుగా బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అనంతరం అమ్మవారికి ప్రదోశ కాల పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.

'దోమకొండ' సాహిత్య సదస్సులో అలంపూర్ వాసి



జోగుళాంబ శక్తిపీఠం: నిజామాబాద్ జిల్లా దోమకొండ సంస్థానం ఆధ్వర్యంలో 'తెలుగు సాహిత్య అభ్యున్నతికి తెలంగాణ సంస్థానాల వారి సేవ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో అలంపూర్ హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బైరోజు రాజశేఖర్ పాల్గొన్నారు. గద్వాల సంస్థానం సాహిత్య, సామాజిక సేవా.. అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ఉపన్యసించారు. అనంతరం ఆయనను దోమకొండ సంస్థానాధీశులు సత్కరించారు. సత్కారంపై జిల్లాకు చెందిన వికాస భారతి అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టితో పాటు ఆనంద్ శర్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి, కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పాల్వాయి రాముడు ఆధ్వర్యంలో పెద్దొడ్డి గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాలలో ప్రజలకు వివరించాలన్నారు. కేంద్రంలో 2024లో బీజేపీ పార్టీ అధికారంలోకి తీసుకురావాలనే ప్రధాన లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు మురళీధర్‌రెడ్డి, దామ నాగరాజు, తిరుపతిరెడ్డి, రెడ్డప్ప, వీరన్నగౌడు, విజయ్‌గౌడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వేగంగా.. సులువుగా!

- టీబీ నిర్ధారణ పరీక్షలకు అధునాతన పరికరాలు
- 2 గంటల్లో ఫలితం.. 24 గంటల్లో పీహెచ్‌సీలకు నివేదిక
- జిల్లాలో టీబీ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం
- ఏడాదిలో 11వేలకు పైగా పరీక్షలు



రాజోలి: క్షయ వ్యాధి అనగానే పరీక్ష చేపించుకునేందుకు బాధితుల నుంచి పరీక్షలు చేసే ల్యాబ్‌ల వరకు ఒకప్పుడు భయం ఉండేది. వ్యాధి నిర్ధారణ కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. అలాంటిది నేడు ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఉపశమనం లభించే విధంగా అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటంతో టీబీ వ్యాధిగ్రస్తులతో పాటు జిల్లా ప్రజలకు పరీక్షల కోసం పడే పాట్లు తప్పాయి. జిల్లాలోని ఆయా మండలాల్లో టీబీ వ్యాధితో బాధపడే వారి సంఖ్య బాగానే ఉన్నప్పటికీ.. వ్యాధి నిర్ధారణ చేపించుకోలేక కొందరు, అవగాహన లేక మరికొందరు మృత్యువాత పడిన దాఖలాలు ఉన్నాయి. టీబీ వ్యాధి పట్ల ప్రభుత్వం చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, ఉచిత పరీక్షలు, ఉచిత వైద్యం, ఆర్థిక సహకారంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. చిన్నపాటి అనుమానం కలిగిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల వద్దకు వెళ్లి పరీక్షలు చేపించుకుంటున్నారు.

జిల్లాలో అధునాతన పరికరాలు

జిల్లాలో గతంలో టీబీ వ్యాది పరీక్షలు చేపించుకోవాలంటే ఎంతో ఇబ్బందితో కూడుకున్న ప్రక్రియ. వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే రూ.2వేల వరకు ఖర్చుతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలి. స్థోమత లేని వారైతే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా కూడా వ్యాధి నిర్ధారణ కావడానికి 20 రోజుల సమయం పట్టేది. గ్రామాల్లో సేకరించిన గల్ల శాంపిళ్లను పరీక్షల నిమిత్తం హైద్రాబాద్‌కు పంపించాల్సి వచ్చేది. దీంతో ఈ 20 రోజుల్లో వ్యాధి తీవ్రత కూడా పెరిగే అవకాశం కూడా ఉండేది. కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాత పరికరాల ద్వారా కేవలం 24 గంటల్లో సంబంధిత పీహెచ్‌సీలో వ్యాధి నిర్ధారణ ఫలితాలను తెలుసుకుని, వీలైనంత త్వరగా వైద్యం పొందే అవకాశముంది. దీంతో చాలా మంది అవగాహనతో పరీక్షలు చేపించుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని క్షయ వ్యాధి నివారణ సెంటర్‌లో ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కోసం 2020 సంవత్సరంలో జిల్లా కేంద్రానికి తీసుకువచ్చిన సీబీ నాట్-16 పరికరాన్ని వాడుతున్నారు. దీని ద్వారా ఒకేసారి 16 మంది శాంపిళ్లను సేకరించి ఒకేసారి 16 మందికి వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. ట్రూనాట్ మిషన్ ద్వారా నలుగురికి ఒకేసారి చేయడంతో పాటు మరింత అదనంగా బ్యాక్టీరియాను తట్టుకునే శక్తి ఉందో లేదో గమనించే సామర్థ్యత కూడా ఈ మిషన్‌లలో ఉండటం విశేషం. వీటి ద్వారా కేవలం 2 గంటల్లో శాంపిళ్లను పరీక్షించి, దాని ఫలితాలను తెలుపుతుంది. 24 గంటల్లో సంబంధిత పీహెచ్‌సీకి ఫలితాలను కూడా పంపుతుంది. వీటితో పాటుగా ఇగ్రా పరీక్ష చేసేందుకు కూడా మిషన్ ను అందుబాటులో ఉంచారు. కుటుంబంలో ఎవరికైనా టీబీ వ్యాధి ఉన్నట్‌లైతే.. వారి కుటుంబ సభ్యులకు వ్యాధి సంక్రమించిందా అని తెలుసుకునేందుకు, వ్యాధి రాకుండా ముందుగానే నివారించేందుకు ఈ పరీక్షలు చేస్తారు. వీటిని కేవలం బాధిత కుటుంబాల వారికి మాత్రమే చేస్తారు.

11వేలకు పైగా పరీక్షలు..

2020లో కోవిడ్ సమయంలో ఈ మిషన్లు గద్వాలకు రాగా.. ప్రారంభంలో కోవిడ్ పరీక్షలకు కూడా ఉపయోగించారు. తర్వాతి కాలంలో టీబీ పరీక్షల కోసం వాడుతున్నారు. 2023 సంవత్సరంలోనే సీబీ నాట్ మిషన్ ద్వారా 11,913 మందికి, మైక్రో స్కాప్ ద్వారా 4,489మందికి పరీక్షలు చేయగా.. 1452 మందికి వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందిస్తున్నారు. 5సంవత్సరాలు వయసు పైబడిన వారికి ఈ పరీక్షలు చేసి వారిని వ్యాధి నుండి కాపాడుతున్నారు. ఇలా అధునాతన మిషన్ల ద్వారా వీలైనంత త్వరగా, సులువుగా పరీక్షలు చేస్తుడటంతో అనుమానం ఉన్నవారు లక్షణాలు ఉన్న వారు వెంటనే టీబీ పరీక్షలు చేపించుకుంటున్నారు. గతంలో జరుగుతున్న ఆలస్యం కారణంగా ఎంతో మంది పరీక్షలు కూడా చేపించుకోలేకపోవడం, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఇబ్బందులు పడేవారు. కానీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో కంటే నాణ్యమైన విధంగా పరీక్షలు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అధునాతన సీబీ నాట్ మిషన్ ద్వారా టీబీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గంటలో ఫలితాలు



గతంలో మాదిరి ప్రస్తుతం పరీక్షలు ఆలస్యం జరగవు. శాంపిళ్లు తీసుకున్నాక 2 గంటల్లో ఫలితాలు వచ్చేస్తాయి. 24 గంటల్లోగా పీహెచ్‌సీలకు పంపుతాం. 2020లో వచ్చిన మిషన్లు చాలా వేగంగా పని చేయగలవు. ఒకేసారి 16 మంది శాంపిళ్లను తీసుకుని నిర్ధారణ చేసే మిషన్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు అదనపు ప్రయోజనాలు కలిగిన మిషన్లు కూడా జిల్లా క్షయ వ్యాది నివారణ కేంద్రంలో ఉన్నాయి.

– సాదిఖ్, టీబీ జిల్లా కో ఆర్డినేటర్

ప్రజలకు ఎంతో ఉపయోగకరం




ఒకే ఏడాదిలో 11 వేలకు పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం, చాలా వేగంగా, సలువుగా చేసే మిషన్లు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంది. ఈ మిషన్లు అందించే వేగవంతమైన ఫలితాలతో ప్రజలకు వ్యాధి నిర్ధారణ చేసి, వైద్యం అందించేందుకు, వ్యాధిని నివారించేందుకు ఎంతో ఉపకరిస్తున్నాయి.

– సిద్దప్ప, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్

పెరుగుతున్న కోవిడ్ కేసులు

- జిల్లాలో మరొకరికి పాజిటివ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆదివారం జనరల్ ఆస్పత్రిలో మొత్తం 92 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా.. ఒకరికి పాజిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన వ్యక్తి నారాయణపేట జిల్లావాసి. ఇక ఇప్పటి వరకు జనరల్ ఆస్పత్రిలో 942 మంది అనుమానితులకు పరీక్షలు చేయగా 12 మందికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది.

పరీక్షలు చేసుకోవాలి..

ప్రస్తుతం వాతావరణ మార్పులతోపాటు ఇతర కారణాలతో చాలామందికి దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నా.. పరీక్షలు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో వారి నుంచి ఇంకొకరికి వైరస్ వేగంగా సోకుతుంది. ప్రస్తుతం జిల్లాలో కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం జేఎన్-1 రకం కరోనాకు కారణమవుతోంది. జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు లాంటిస్వల్ప లక్షణాలుండటంతో చాలామంది నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ప్రస్తుతం కొత్త రకం వేరియంట్ వైరస్ ఒక్కొక్కరిపై ఒక్కోలా ప్రభావం చూపుతోంది. థర్డ్‌వేవ్‌లో స్వల్ప లక్షణాలు ఉండటంతో ప్రస్తుతం కూడా చాలామంది పరీక్షలకు సైతం దూరంగా ఉంటున్నారు. రెండు, మూడు రోజుల పాటు జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులుంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేసుకోవాలి. కరోనా నిర్ధారణ అయితే మందులు వాడుతూ గుంపుల్లో తిరగకుండా వారంరోజుల పాటు ప్రత్యేక గదిలో ఉండాలి. ఈ వేరియంట్‌తో ఎలాంటి ఇబ్బంది లేకున్నా.. వేగంగా వ్యాప్తి చెందుతోంది. బీపీ, షుగర్, మధుమేహం, క్యాన్సర్, గుండె, మూత్ర పిండాలు, కాలేయ వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు వృద్ధులు, గర్భిణులు, చంటిపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పండుగల నేపథ్యంలో రద్దీగా ఉన్న బస్సులు, రైళ్లలో ప్రయాణించడంతో ఒకరి నుంచి ఒకరికి వైరస్ సోకుతుంది. వారికి వైరస్ సోకితే కొన్నిసార్లు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది.

మాజీ ఎమ్మెల్యే ఆలకు హరీశ్‌రావు పరామర్శ

అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ఆల నివాసానికి హరీశ్‌రావుతోపాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్, శాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి వచ్చి శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. శశివర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను హరీశ్‌రావు ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఆలతో మాట్లాడి ధైర్యం కల్పించారు. సాయంత్రం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నాసాగర్ వచ్చి సంతాపం వ్యక్తం చేశారు. శశివర్ధన్‌రెడ్డి చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు.



మాజీ ఎమ్మెల్యే ఆలను ఓదార్చుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

అట్టహాసంగా పుస్తకాల పరిచయ సభ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అభ్యుదయ మార్గంలో ఆచరణాత్మక కవిగా, సాహితీ భీష్ములుగా వల్లభాపురం జనార్దన అని తెలంగాణ సాహితీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తంగిరాల చక్రవర్తి అభిప్రాయపడ్డారు. జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఆదివారం తెలంగాణ సాహితీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పుస్తకాల పరిచయ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభ్యుదయ కవిత్వంలో పాలమూరు జిల్లా అనగానే ప్రముఖంగా గుర్తొచ్చే పేరు వల్లభాపురం జనార్దన అని పేర్కొన్నారు. సుదీర్ఘ కవితా ప్రయాణంలో తన అనుభవాలను అక్షరబద్ధం చేసి ఆత్మకథను వెలువరించాలని ఆకాంక్షించారు. ఎనిమిది పదుల వయసులోనూ సుసంపన్న సాహితీ సేద్యం చేస్తున్న ఆయన నేటి యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు. అంతకు ముందు 'విజయ క్రాంతి' సంగీత రూపకం, 'పహారా కాస్తున్న రాత్రి' కవితా సంపుటి, 'యుగ పతాక' మహాకవి శ్రీశ్రీ దీర్ఘ కవిత, విష కౌగిలి 123 నానీలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. 'పహారా కాస్తున్న రాత్రి' కవితల పరిచయాన్ని యువకవి బోల యాదయ్య చేయగా.. యుగ పతాక పుస్తక పరిచయాన్ని ప్రముఖ కవి, అధ్యాపకులు పరిమళ్, విజయ క్రాంతి సంగీత రూపక పుస్తక పరిచయాన్ని ప్రసిద్ధ కవి వనపట్ల సుబ్బయ్య, విష కౌగిలి 123 నానీలను డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుభాషిణి సమగ్రంగా సమీక్షించారు. తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షుడు వైద్యం భాస్కర్ రచనలో వెలువడిన పాటల సీడీని సైతం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ జిల్లా గౌరవాధ్యక్షుడు సురభి జగపతి రావు, జిల్లా అధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, కవులు డాక్టర్ పొద్దుటూరు ఎల్లారెడ్డి, బాదేపల్లి వెంకటయ్యగౌడ్, విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.ప్రమోద్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కాళిదాసు, కేఏఎల్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు

క్రీడాస్ఫూర్తి ముఖ్యం

గద్వాల అర్బన్: ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో రాణించాలని డీవైఎస్‌ఓ ఆనంద్, పట్టణ ఎస్‌ఐలు శ్రీకాంత్, అబ్దుల్ షూకుర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. విజేతగా నిలిచిన కృష్ణ, కృష్ణాజీ, ద్వితీయ స్థానంలో నిలిచిన వెంకటేష్, సాయికి వారు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి గద్వాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకులని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, నిర్వాహకులు రాజేష్, రఫీ, చిన్న నర్సింహ్మా, దేవేందర్, రాములు తదితరులు ఉన్నారు.




విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న డీవైఎస్‌ఓ ఆనంద్, ఎస్‌ఐలు

9న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్లలోని మినీ స్టేడియంలో ఈ నెల 9న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్-14 విభాగం బాలుర క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాఠశాల బోనోఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం పీఈటీ మోయినుద్దీన్ సెల్ నం .99853 75737ను సంప్రదించాలని సూచించారు.

పరుగులు పెట్టేనా..?



పాలమూరు ప్రాజెక్టులోని ఎల్లూరు పంపుహౌజ్

- మంత్రుల ప్రకటనతో 'పాలమూరు' ప్రాజెక్టుపై చిగురిస్తున్న ఆశలు
- మూడు నెలల క్రితమే ఒక మోటారు ప్రారంభం
- ఒక పంపుతో రెండు టీఎంసీల నీరు ఎత్తిపోత
- పనుల్లో తగ్గిన వేగం.. కనిపించని కార్మికుల అలికిడి
- తాజాగా నిధుల మంజూరుకు కేంద్ర ప్రభుత్వం హామీ

కొల్లాపూర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించాలనే సంకల్పంతో నిర్మించిన పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులు నెమ్మదించాయి. గత సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులోని ఒక మోటారును ఎల్లూరు వద్ద లాంఛనంగా ప్రారంభించారు. కొన్నిరోజులపాటు నీటి ఎత్తిపోతలు చేపట్టి తర్వాత ఆపేశారు. ఆ తర్వాత పెండింగ్‌లో అసంపూర్తి పనులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టిపెట్టారు. అయితే డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పనుల పురోగతిపై అస్పష్టత నెలకొంది. అయితే తాజాగా పాలమూరు ప్రాజెక్టు విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా నిధుల మంజూరుకు హామీ ఇవ్వడంతో పనుల వేగంపై ఆశలు చిగురిస్తున్నాయి.

పనులు జరుగుతున్నాయి..



పాలమూరు ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. సివిల్, కాంక్రీట్ వర్క్స్ పూర్తయ్యాయి. ఆయా పనులు చేసే కార్మికులు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు చేపట్టే వారు మాత్రమే ఎల్లూరు పంపు హౌజ్ వద్ద ఉన్నారు. నెల రోజుల్లో మూడో మోటారు బిగింపు పూర్తవుతుంది. నాలుగు డెలివరీ సిస్టమ్స్ పనులు పూర్తయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రణాళికాబద్ధంగా పనులు జరుగుతున్నాయి. తాగునీటి అవసరాల కోసం 2 టీఎంసీల నీటిని ఎత్తిపోశాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

ఎన్‌జీటీ నుంచి..

రెండు నెలల క్రితం పాలమూరు ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి సాగునీటి ఎత్తిపోతలకు కూడా అనుమతులు లభించాయి. అయితే వాటికి సంబంధించిన పూర్తిస్థాయి ఉత్తర్వులు ఇంకా అధికారికంగా అందకపోవడంతో ప్రస్తుతం తాగునీటి అవసరాలకు సంబంధించిన పనులే జరుగుతున్నాయి. ఇందుకోసం మూడు విడతల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో భాగంగా ఒక్క పంపు ద్వారా 2 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. రెండు, మూడు దశల్లో మొత్తం 7.15 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన పనులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మార్పులు జరిగే అవకాశం



నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన డెలివరీ పంపులు

పాలమూరు ప్రాజెక్టులో భాగంగా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలో మొదటి ప్యాకేజీ కింద లిఫ్టు నిర్మాణాలు, రెండో ప్యాకేజీ కింద నార్లాపూర్ రిజర్వాయర్, మూడో ప్యాకేజీ కింద కాల్వల తవ్వకాలు చేపట్టారు. మొదటి ప్యాకేజీ పనులను నవయుగ, రెండో ప్యాకేజీ రాఘవ, మూడో ప్యాకేజీ పీఎస్‌కే కంపెనీలు చేపట్టాయి. గత ప్రభుత్వ హయాంలో మొదటి ప్యాకేజీ పనులు మధ్యలోనే మెగా కంపెనీకి అప్పగించారు. రిజర్వాయర్ నిర్మాణం సైతం చివరి దశలో వారే పర్యవేక్షించారు. కాల్వల తవ్వకాల్లో పీఎస్‌కే కంపెనీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు కాల్వల తవ్వకాలు ఇంకా పూర్తికాలేదు. పనుల్లో నిర్లక్ష్యం కారణంగా ఈ కంపెనీని ప్యాకేజీ-3 నుంచి తప్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. రెండో ప్యాకేజీ పనులను మళ్లీ రాఘవ కంపెనీ చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొదటి ప్యాకేజీ పనులు యథాతథంగా కొనసాగుతాయా.. లేక మార్పులు జరుగుతాయా అనేది తేలాల్సి ఉంది.

కనిపించని కార్మికుల సందడి..

ప్రాజెక్టు ప్రారంభం నాటికి ఒక్క ఎల్లూరు పంపుహౌజ్‌లో రెండు మోటార్లను బిగించారు. వీటిలో ఒక్కదానికి మాత్రమే విద్యుత్ సప్లయ్, చార్జింగ్ వంటి ప్రక్రియలు పూర్తిచేసి.. నీటి ఎత్తిపోతలు చేపట్టారు. తర్వాతి కాలంలో రెండో మోటారు ఏర్పాటు కూడా పూర్తిచేశారు. నవంబర్‌లో మూడో మోటారు బిగింపు పనులు ప్రారంభించారు. మరో నెలరోజుల వ్యవధిలో ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే డెలివరీ మెయిన్స్ పనులు కొనసాగుతున్నాయి. నాలుగు డెలివరీ పంపులకు సంబంధించిన పనులు పూర్తి కాగా.. ఇంకా సగం పనులు చేపట్టాల్సి ఉంది. సివిల్ వర్క్స్, కాంక్రీట్ పనులు తుది దశకు చేరుకోవడంతో కార్మికులు పెద్దసంఖ్యలో ఎల్లూరు లిఫ్టు వద్ద నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం విద్యుత్, మెకానికల్ వర్క్స్ మాత్రమే నడుస్తున్నాయి. దీంతో ప్రాజెక్టు వద్ద కార్మికుల సందడి కనిపించడం లేదు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


చెన్నమోని రవి(ఫైల్)

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన చెన్నమోని రవి(21) ఆదివారం గోవర్ధనగిరి సమీపంలో మామిడితోటలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలుగు చెన్నమోని శేషమ్మ, బాలయ్య కుమారుడు రవి గోవర్ధనగిరికి చెందిన రైతు మామిడితోటను తన తండ్రి లీజుకు తీసుకున్నారు. మామిడితోటకు క్రిమిసంహారక మందులు పిచికారి చేసిన తర్వాత బల్బు ఏర్పాటు చేసేందుకు 11 కేవీ లైన్‌లకు వైర్లు తగిలించేందుకు వెళ్లి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎస్‌ఐ రవిప్రకాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ తీగలు తగిలి విద్యార్థి..


ఫక్రుద్దీన్ (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి విద్యార్థి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో నివాసముంటున్న సుభాన్, నవీన దంపతుల కుమారుడు ఫక్రుద్దీన్ (13) పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో తన స్నేహితులతో సరదాగా క్రికెట్ ఆడుతున్నాడు. బాల్ ఓ భవంతిపై పడడంతో తెచ్చుకునేందుకు వెళ్లిన ఫక్రుద్దీన్ బాల్‌ను తీసుకుని కిందకు విసిరే సమయంలో అక్కడ విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు చేతికి తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన చుట్టు పక్కల వారు విషయాన్ని బాలుడి బంధువులకు తెలియజేశారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఫక్రుద్దీన్ మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పదంగా బాలుడు మృతి


బద్రీనాథ్(ఫైల్)

పెంట్లవెల్లి: అనుమానస్పదంగా బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని యంగంపల్లికి తండాకు చెందిన ఉడావత్ అశోక్, భారతీలకు ఆరేళ్ల క్రితం వివాహం కాగా వారికి కుమార్తె సోని, కుమారుడు బద్రీనాథ్ (3) ఉన్నారు. వీరు హైదరాబాద్‌లోని ఉక్కుగూడలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో భార్యపై అనుమానంతో అశోక్ గొడవపడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండలో డ్రైవింగ్ చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బద్రీనాథ్ బాత్రూంలో స్పృహతప్పి పడిపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో బాలుడి మృతదేహాన్ని భారతీ తీసుకుని యంగంపల్లికి ఆదివారం ఉదయం వచ్చింది. విషయం తెలుసుకున్న భర్త అశోక్ గ్రామానికి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. భారతికి, పాన్‌గల్ మండలం రేముద్దులకు చెందిన సురేష్‌తో వివాహేతర సంబంధం ఉందని, వారిద్దరు కలిసే నా కుమారుడిని చంపారని అశోక్ ఎస్‌ఐ సురేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ యంగంపల్లిలో విచారణ చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు..


నాగేందరావు (ఫైల్)

మానవపాడు: మండలంలోని పెద్దపోతులపాడుకు చెందిన నాగేందరావు(54) ఆదివారం తెల్లావారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయన ఉండవెల్లి మండలం కంచుపాడు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు భార్య జ్యోతి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతిపై ఎంఈఓ శివప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని తాడూరుకు చెందిన పంగ మొగులాల్ వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఆదివారం పంగ మొగులాల్ భార్య పంగ ఉమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. డిసెంబర్ 31న సాయంత్రం పంగ సతీష్ తన బైక్‌పై మొగులాల్‌ను ఎక్కించుకొని హాజీపూర్ దగ్గరకు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా బైక్ అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ తెలిపారు. సతీష్ అజాగ్రత్తగా, అతివేగంగా బైక్ నడపడంతోనే తన భర్త కిందపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ చనిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువుకు రక్షణ కరువు

- అక్రమార్కుల పాలవుతున్న సల్కర్‌పేట్ పోతులవాని చెరువు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు


చెరువులో వేసిన నాట్లు


పట్టా భూమిగా చెబుతూ చెరువులో చేసిన కరిగెట


చెరువులోని నుంచి వేసిన పైపులైన్

గండేడ్: ఎకరాలకొద్ది నీరందించి అన్నదాతకు ఆసరగా నిలవాల్సిన చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఏళ్ల తరబడి సాగునీరందించిన చెరువు కొందరి అక్రమార్కుల స్వార్థపూరిత చర్యల కారణంగా ఆక్రమణకు గురవుతుంది. అయితే ఇది పట్టా భూమినా లేక చెరువు శిఖం అనేది సంబంధిత అధికారులకు అవగాహన లేకపోవడం గమనార్హం. గతంలో ఉన్న ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువుకు ఎసరు వచ్చింది. వివరాల్లోకి వెళితే గండేడ్ మండలంలోని సల్కర్‌పేట్‌లో పోతులావాని చెరువు గ్రామానికి ఆనుకుని ఉంది. దీనికింద 39 ఎకరాల ఆయకట్టు నిర్ధేశించారు. అయితే దీనికింద అనధికారికంగా 100 ఎకరాల వరకు సాగుబడి అవుతుంది. దీని కింద 45 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. 30 ఏళ్లుగా ఇదే తరహాలో సాగు కొనసాగుతుంది. గతేడాది నుంచి చెరువులో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు రైతులు కబ్జా చేస్తున్నారు. చెరువు ఆనవాళ్లను చెరిపే పనిలో పడ్డారు.

పట్టా భూమి అంటూ ఆక్రమణ

చెరువులోని భూమి కొద్దిగా కొద్దిగా కబ్జాకు గురవుతుంది. ఇప్పటికే దాదాపు 70 శాతం వరకు చెరువులో ఉన్న భూమి తమకు పట్టా ఉందని పలువురు చెబుతున్నారు. దీని కారణంగా తాము సాగు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇది ఎంత వరకు నిజమనేది పక్కాగా తెలియరావడం లేదు. కట్ట వరకు పట్టా భూములు ఎలా ఉంటాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలా అయితే ఆయకట్టు ఎలా నిర్దేశిస్తారని పలువురు వాపోతున్నారు. కొందరు రైతులు డోజర్లు, ట్రాక్టర్లు ఉపయోగించి కొత్తగా బందాలు వేస్తున్నారు. మరికొందరు బోర్ల నుంచి పైపులైన్లు వేస్తున్నారు. ఇంకొందరు ఏకంగా చెరువుకట్టను తవ్వి అవతలికి ఇవతలికి పైపులు వేశారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే తెలుస్తుంది. ఇప్పటికే పలువురు ఏకంగా నాట్లు కూడా వేశారు. అసలు ఉన్న ఆయకట్టుకు నీరేలా అంటూ వాపోతున్నారు. దీంతో పాటు చెపల పెంపకానికి కూడా అవకాశం లేకుండా పోతున్నది.

విచారణ చేస్తాం..

సల్కర్‌పేట్ పోతులవాని చెరువు కబ్జాకు గురైనట్లు ఇరిగేషన్ అధికారులు తమకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో ఉండడం వల్ల దాన్ని పరిశీలించలేదు. చెరువులో ఉన్నది పట్టానా శిఖమా అనేది తేలుస్తాం. సోమవారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

– నాగలక్ష్మి, తహసీల్దార్ ,గండేడ్

అలుగు మాయం..

చెరువు శిఖం ఒక్కటే కాదు అలుగు సైతం కబ్జా కోరల్లో చిక్కుకుంది. అలుగును సైతం బందాలుగా మార్చి సాగుకు సిద్ధం చేయడం గమనార్హం. గతంలో ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్ (మునుగపాటు ప్రాంతం) హద్దులు గుర్తించి పిల్లర్లు పాతడంలో నిర్లక్ష్యం వహించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూమి అయినా సరే సాగుచేయరాదు. నీళ్ల లేని సమయంలోనే సాగు చేయాలి. ఏకంగా బయటి నుంచి మట్టి తెచ్చి పోసి మరీ బందాలు చేస్తూ ఈ ఏడు సాగుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గింది. ఓవైపు సాలార్‌నగర్ ప్రాజెక్టు నుంచి రెండు కిలోమీటర్ల మేర రూ.5లక్షలు వెచ్చించి 30ఏళ్ల క్రితం నిర్మించిన పాటుకాల్వను సైతం ఆక్రమణదారులు చెరిపివేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. కనీసం ఏనాడు దానివైపు తిరిగి చూడలేదు. అది పట్టా భూమినా చెరువు శిఖం అనేది తెల్చలేని పరిస్థితి. అధికారులకే సరైన అవగాహన లేదంటే పరిస్థితి ఏంటో ఇట్టే తెలుస్తుంది. ఇరిగేషన్ అధికారుల వద్ద కూడా పూర్తిస్థాయి సమాచారం లేదు. స్థానికులు మాత్రం అది పక్కా చెరువు శిఖమే కాని ఆక్రమించుకుంటున్నారని గుట్టుగా పట్టాలు చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులు మేల్కొన్నారు. గతంలోనే దీనికి చర్యలు చేపట్టి ఉంటే చెరువుకు ఈ గతి పట్టేది కాదు.

పోలీసులకు ఫిర్యాదు

ఈవిషయమై ఇరిగేషన్ అధికారులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ డీఈ వెంకట్‌రాములు, ఏఈ మనోజ్ నాలుగు రోజుల క్రితం మహమ్మదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు చెరువు భూమి శిఖమా పట్టానా తేల్చాల్సిందిగా రెవెన్యూ వారిని కోరారు. లిఖిత పూర్వకంగా గండేడ్ తహసీల్దార్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఆక్రమణకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని డీఈ తెలిపారు.

నేటినుంచి కోయిల్‌సాగర్ నీటి విడుదల


కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు సోమవారం నీటిని విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నీటి పారుదలశాఖ అధికారుల షెడ్యూల్ ప్రకారం 6వ తేదీన నీటిని విడుదల చేయాల్సి ఉండగా.. రెండు రోజులు వాయిదా వేశారు. ప్రాజెక్టు కింద యాసంగి పంటలకు 5 తడులుగా నీటిని విడుదల చేయడానికి అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ప్రతి తడి 10 రోజులు వదిలి విరామం ఇవ్వనున్నారు. ప్రస్తుతం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 30.8 అడుగుల మేర నీటినిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. కేవలం 1.10 అడుగుల నీటిమట్టం తక్కువగా ఉంది.

పాత ఆయకట్టు 12వేల ఎకరాలు..

కోయిల్‌సాగర్ పాత ఆయకట్టు కింద ఉన్న 12వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని అధికారులు ప్రకటించారు. కుడి కాల్వ కింద మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట మండలాల్లో 9వేల ఎకరాలు, ఎడమ కాల్వ కింద దేవరకద్ర మండలంలోని 3వేల ఎకరాల పాత ఆయకట్టు ఉంది.

కొత్తగా ప్రకటించిన తేదీలు ఇలా..

1వ తడి: 2024 జనవరి 8నుంచి 18వ తేదీ వరకు – 10 రోజులు
విరామం: జనవరి 19నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు – 15 రోజులు
2వ తడి: ఫిబ్రవరి 5నుంచి 15వ తేదీ వరకు – 10 రోజులు
విరామం: ఫిబ్రవరి 16నుంచి 26వ తేదీ వరకు – 10 రోజులు
3వ తడి: ఫిబ్రవరి 27నుంచి మార్చి 8వ తేదీ వరకు – 10 రోజులు
విరామం: మార్చి 9నుంచి 24వ తేదీ వరకు – 15 రోజులు
4వ తడి: మార్చి 25నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు – 10 రోజులు
విరామం: ఏప్రిల్ 6నుంచి 16వ తేదీ వరకు – 10 రోజులు
5వ తడి: ఏప్రిల్ 17నుంచి 27వ తేదీ వరకు – 10 రోజులు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి. మొత్తం 5 తడులుగా నీటిని విడుదల చేస్తాం. యాసంగి పంటలకు నీటిని అందించిన తర్వాత వేసవిలో తాగునీటి అవసరాలకు నీరు సరిపోకుంటే జూరాల నుంచి తీసుకుంటాం. నీటిని విడుదల చేయడానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరవుతారు. – ప్రతాప్‌సింగ్, ఈఈ, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

వైభవంగా అబ్దుల్ ఖాదర్ గంధోత్సవం


ఒంటెపై గంధం ఊరేగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ షా సాహెబ్ దర్గా 85వ ఉర్సును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రధాన ఘట్టమైన గంధోత్సవం ఆదివారం వైభవంగా చేపట్టారు. ముతవల్లి షేక్‌బడేసాబ్ ఇంటి నుంచి ఒంటెపై బయలు దేరిన గంధం ఊరేగింపు అశోక్ టాకీస్ చౌరస్తా, క్లాక్ టవర్, ఎస్బీహెచ్ రోడ్ వన్ టౌన్ చౌరస్తా, తూర్పుకమాన్ వీధుల మీదుగా దర్గా వరకు తీసుకెళ్లారు. దారి పొడవునా భక్తులు గంధాన్ని సందర్శించి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం దర్గాపై పూలు, చాదర్లు కప్పి ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో దర్గా ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీరాఖాద్రి, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దీపోత్సవం (చిరాగా) నిర్వహించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మంగళవారం జియారత్ ఫాతేహాతో ఉత్సవాలు ముగుస్తాయి.

బైక్ సీటు కింద పాము


బైక్ సీటు కింద ఉన్న పామును బయటకు తీస్తున్న యువకులు

అడ్డాకుల: బైక్ ఆఫ్ అయితుందని మెకానిక్ దగ్గరికి తీసుకెళ్లిన యువకులకు సీటు కింద పాము కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్‌కు చెందిన బాలు, వినయ్ అక్కడే ఓ పరిశ్రమలో పని చేసేవారు. కంపెనీ పని మీద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడిపత్రికి వెళ్లారు. ఆదివారం తిరుగు ప్రయాణంలో కర్నూల్ వద్ద బైక్‌లో పెట్రోల్ పోయించుకున్నారు. అడ్డాకుల సమీపంలోకి రాగానే బైక్ ఆఫ్ అయితుండటంతో స్థానికంగా ఉన్న మెకానిక్ దగ్గరికి వచ్చారు. దాన్ని బాగు చేసే క్రమంలో బైక్ సీటు తీయగా దాని కింద పాము కనిపించడంతో అందరూ ఆశ్చర్యపోయారు. తర్వాత యువకులంతా కలిసి దాన్ని బయటకు తీసి చంపేశారు.

భర్తపై కేసు నమోదు

మహమ్మదాబాద్: భార్యపై చేయి చేసుకున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ఈసరి రాములమ్మ, ఈసరి రాములుతో వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం కూడా ఉన్నారు. భర్త తాగుడుకు బానిసై నిత్యం డబ్బులు వృథా చేస్తున్నావని భార్య అడుగగా ఆమెతో గొడవపడి గ్రామ పెద్దల మధ్య పంచాయితీ పెడదామని వెళ్లగా వీధిలో తనపై దాడి చేయగా స్తంభానికి తగిలి తలకు గాయాలయ్యాయి. దీంతో భార్య పిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘ఆరోగ్య శ్రీ’ డబ్బులు వచ్చాయంటూ మోసం

రూ.73వేలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

మహమ్మదాబాద్: ఆరోగ్యశ్రీ నుంచి మీకు డబ్బులు వచ్చాయి.. వచ్చి తీసుకెళ్తారా.. లేక ఫోన్‌పే ద్వారా పంపమంటారా అని వచ్చిన ఓ ఫోన్‌కాల్‌తో రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఖాతాలో నగదు మాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నంచర్లగేట్ పల్లవి కళాశాల కరస్పాండెంట్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మాలెల అంజిలయ్యకు ఈనెల 5న ఓ ఫోన్ కాల్ వచ్చింది. మేము హైదరాబాద్ ఆరోగ్యశ్రీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీకు ఆరోగ్యశ్రీ డబ్బులు వచ్చాయి. హైదరాబాద్ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్తారా? లేదా మీఅకౌంట్‌కు ఫోన్‌పేద్వారా వేయమంటారా అని మాట్లాడారు. దీంతో ఫోన్‌పే ద్వారా వేయండని చెప్పడంతో ఫోన్‌పే యాప్‌కు రెక్వెస్ట్ పంపించాం.. క్లిక్ చేయమని చెప్పగా నేరగాళ్లు చెప్పిన విధంగా చేయగా మొదలు రూ.45వేలు, తర్వాత రూ.28వేలు అకౌంట్ నుంచి కట్ అయ్యాయి. గమనించిన అంజిలయ్య ఈమేరకు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన 13వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాలమూరు క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. డిస్కస్ త్రోలో విజయప్రసాద్ మూడోస్థానం, 800 మీటర్లు, 5 కి.మీ. పరుగు పందెంలో దామోదర్ రెండోస్థానంలో నిలిచారు. త్రిపుల్ జంప్, లాంగ్ జంప్, 100 మీ. పరుగు పందెంలో వనజారెడ్డికి మొదటిస్థానం, 100 మీ., 200మీ., లాంగ్‌జంప్‌లలో కృష్ణయ్య రెండోస్థానంలో నిలవగా.. షార్ట్‌పుట్‌లో ఆంజనేయులు మొదటి, లాంగ్‌జంప్‌లో మూడోస్థానం, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాలలో పి.పరుశురాంకు రెండోస్థానం దక్కింది. ఇక 100 మీ. పరుగుపందెం, షార్ట్‌పుట్, 5 కి.మీ. నడకలో దేవదానానికి మొదటిస్థానం రాగా, హ్యామర్‌త్రోలో డా.ఎస్.చంద్రశేఖర్‌గౌడ్‌కు మొదటిస్థానం వచ్చింది. అనంతరం వీరిని మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ అభినందించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

లింగాల: మండలంలోని శాయిన్‌పేటకు చెందిన చాకలి సత్యనారాయణ(55) గ్రామ సమీపంలోని చెరువులో చేపల వేటకు ఆదివారం వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో నీటిలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

సస్యరక్షణతోనే మిర్చిలో దిగుబడి

సాగులో ఉన్న మిర్చి పంట




బూడిద తెగులు సోకిన ఆకు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: మిర్చి పంటలో సమస్య రక్షణ పద్ధతులు పాటించి కాపాడుకోవాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మిర్చి సాగు అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం కాయ పక్వ దశలో ఉంది. అనేక చీడపీడలు వ్యాపించి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. శిలింధ్రాలు, పురుగులు, సూక్ష్మధాతువు లోపాలు ఉన్నట్లు ఏడీఏ రైతులకు వివరించారు. కొమ్మ ఎండు, కాయకుళ్లు బూడిద తెగుళ్లు, కాయతొలిచే పురుగు వలన పంట నష్టపోయే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. నాణ్యత తగ్గి తాలుకాయలు ఏర్పడి మార్కెట్‌లో ఆశించిన మద్దతు ధర లభించదని చెబుతున్నారు. అందుకు నివారణ చర్యలు చేపడితే రైతులు పంట దిగుబడి పెరుగుతుందని వివరిస్తున్నారు.

కొమ్మ ఎండు–కాయ కుళ్లు

మిరప పైరు పూత దశ నుంచి కాయ దశకు వచ్చే సమయాల్లో కొమ్మ ఎండు తెగులు, కాయ కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. ఈ తెగుళ్ల కారణంగా కొమ్మ, కాయ మీద బూడిద రంగు మచ్చలు ఏర్పడుతాయి. వీటి ప్రభావంతో కొమ్మలపై నుంచి కింది వరకు ఎండుతాయి. కాయమీద మచ్చలు చిందరవందరగా ఏర్పడుతాయి. వీటితో శిలీంధ్ర ఉత్పత్తి కణాలు ఉండటంతో కాయ సహజ రంగును కోల్పోతుంది.

నివారణ చర్యలు

వీటి నివారణకు ఎకరం పొలానికి ప్రొపికొనజోల్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి లేదా డైఫెన్ కొనజోల్ 100 మి.లీ.లను 200 లీటర్ల నీటిలో కలిపి లేదా పైరాక్లీ స్ట్రోబిన్ 200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

బూడిద తెగులు

చలి, తేమ వంటి వాతావరణ మార్పులతో బూడిద తెగులు సోకుతుంది. ఈ తెగులును కలుగజేసే శిలీంద్రం వలన ఆకు కింది భాగంలో బూడిద రంగులో తెల్లటి పొడి ఏర్పడుతుంది. దీని వలన ఆకుపచ్చ రంగును కోల్పోయి పసుపు రంగులోకి మారి రాలిపోతుంది.

నివారణ

గంధకం 300 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. లేదా డైనోకాప్ లేదా బెలటాన్ 200 మి.లీ.లను 200 లీటర్ల నీటిలో లేదా ట్రైడిమార్ఫ్ 200 మి.లీ.లను లీటర్ నీటిలో కలిపి లేదా అజాక్సిస్ట్రోబిన్ 200 మి.లీ.లను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పొలంలో పిచికారి చేయాలి.

కాయ తొలిచే పురుగు

కాయ తొలిచే పురుగు కాయలను రంధ్రం చేసి లోపలి భాగాన్ని తినడం వలన కాయ పరిమాణం తగ్గి నాణ్యత, దిగుబడి కోల్పోతాయి.

నివారణ

అసిఫేట్ 1.5 గ్రాముల లీటర్ నీటిలో లేదా నువులురాన్ ఒక మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి లేదా రైనాక్సీఫైర్ 0.3 మి.లీ.ను లీటరు నీటిలో లేదా ఫ్లూబెండమైడ్ 0.3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాల్సి ఉంటుంది.

పక్షి కన్ను మచ్చ తెగులు

తేమతో కూడిన చల్లటి వాతావరణంలో మిరప ఆకులపై సర్కోస్పోరా, ఆల్టర్‌నేరియా మచ్చలు ఆశిస్తాయి. సర్కోస్పోరా ఆశించినట్లయితే పక్షికన్ను ఆకారం గల మచ్చలు ఏర్పడుతాయి. ఈ ప్రభావంతో పంటలో నాణ్యత, రంగు తగ్గుతాయి.

నివారణ

ప్రొపికొనజోల్ 200 మి.లీ.లను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పొలంలో పిచికారి చేసుకోవాలి. లేదా డైఫెన్‌కొనజోల్ 100 మి.లీ.లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

జింకు లోపం

భాస్వరం ఎక్కువగా వాడితే జింకులోపం కనిపిస్తోంది. ఆకుల కనుపుల మధ్య పసుపు పచ్చ రంగులోకి మారి రాలిపోతాయి.

నివారణ

జింకు లోపం నివారణకు చీలేటెడ్ జింక్ 2 గ్రాములను లీటరు నీటితో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

చెరుకు ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


రాయిణిపేట వద్ద హైవేపై చెరుకు ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

కొత్తకోట రూరల్: ఆగి ఉన్న చెరుకు ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రాయిణిపేట జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అప్పరాల సమీపంలో గల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి కొత్తకోట వైపు నుంచి చెరుకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ టైర్ పంక్చర్ కావడంతో హైవే పైనే నిలిచిపోయింది. హైదరాబాద్ నుంచి బెంగుళూర్ వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను గమనించపోవడంతో బలంగా ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ పంకజ్‌కుమార్‌సింగ్ ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రుడిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చెరుకు ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదంలో ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ఇంట్లో చోరీకి యత్నం

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భీంనగర్ కాలనీకి చెందిన తిప్పయ్యశెట్టి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి నారాయణపేటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం ఇంట్లోకి చొరబడి బీరువాలోని వస్త్ర, సామగ్రిని చిందరవందరగా పడేశారు. ఎలాంటి నగదు, ఆభరణాలు చోరీకి గురి కాలేదన్నారు. ఇంటికి వచ్చిన క్రమంలో తాళం ధ్వంసం చేసి ఉండడం గమనించి చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కాలనీ వాసులను ఆరా తీశారు. రూ. 20 వేల విలువ చేసే సెల్‌ఫోన్ అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లోకేశ్ మాకొద్దు 'బాబూ'..!

చినబాబు పర్యటనలతో పార్టీ పరువు పోతోందని తమ్ముళ్ల గగ్గోలు

- ఆయన ప్రసంగాలు, వ్యవహారశైలి బాగోలేదని ఆందోళన
- అందుకే వ్యూహాత్మకంగా పాదయాత్ర తర్వాత లోకేశ్ పర్యటనలకు చంద్రబాబు చెక్
- 'రా కదలిరా', జయహో బీసీ వంటి ముఖ్య కార్యక్రమాలకూ దూరం
- మంగళగిరికే పరిమితమై అప్పుడప్పుడు లోకల్‌గా చక్కర్లు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీకి 'లోకేశ్' తలనొప్పి పట్టుకుంది. ఆ పేరు వింటేనే ఆ పార్టీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఆయనవల్ల పార్టీ పరువుతో పాటు తమ పరువు పోతోందని లబోదిబోమంటున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూడాలని ముఖ్య నేతలకు బహిరంగంగానే వేడుకుంటున్నారు. లోకేశ్ ప్రసంగాలు, వ్యవహారశైలి వల్ల ఉన్న ఓట్లుకూడా పోయే పరిస్థితి ఉందని వారు మొత్తుకుంటున్నారు. లోకేశ్ మాట్లాడేటప్పుడు అన్నీ తప్పులు మాట్లాడడం, తెలుగు పదాలు సరిగా ఉచ్చరించలేకపోవడం వల్ల సోషల్ మీడియాలో లోకేశ్ తొలినుంచి విపరీతంగా ట్రోల్ అవుతున్న విషయం తెలిసిందే. అవగాహనా రాహిత్యంతో ఏదో ఒకటి మాట్లాడేయడం వల్ల ఆయనవల్ల పార్టీ అనేక సార్లు ఇరకాటంలో పడింది. ప్రజలను ఆకర్షించలేక పోగా ఆయన చేష్టలు, డైలాగులవల్ల పార్టీకి నష్టమే తప్ప ఎలాంటి లాభంలేదనే భావన మొదటి నుంచి పార్టీ నేతల్లో బలంగా నాటుకుపోయింది. కానీ, తానే పార్టీని మొత్తం నడిపిస్తున్నట్లు లోకేశ్ బిల్డప్ ఇస్తూ పర్యటనలు చేసి తమకు ఎక్కడలేని ఇబ్బందికర పరిస్థితులు సృష్టించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు పలువురు ముఖ్యులు అనేకసార్లు చెప్పినా ఆయన విని ఊరుకునే వారే తప్ప ఎలాంటి స్పందన ఉండేది కాదు. ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో నేతలు ఈ విషయాన్ని గట్టిగా చెబుతుండడంతో పార్టీ శ్రేణుల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గక తప్పలేదు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో లోకేశ్‌ను జిల్లా పర్యటనలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నిర్ణయించారు. దీంతో కొద్దిరోజులుగా లోకేశ్ జిల్లాల పర్యటనలు చేయడం లేదు. పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం ఆయన్ను రానీయడంలేదు. యువగళం పాదయాత్ర తర్వాత లోకేశ్ జిల్లా పర్యటనలు, పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు.

పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌తో కనువిప్పు..

నిజానికి.. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయింది. దీనికోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రేణులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో ఆయనకు ఎంత ప్రచారం కల్పించినా బూడిదలో పోసిన పన్నీరైంది. ఆయన సభలకు జనాన్ని సమీకరించలేక నేతలు చేతులెత్తేశారు. డబ్బులిచ్చినా, ప్రలోభాలకు గురిచేసినా లోకేశ్ సభలంటే జనం వచ్చే పరిస్థితిలేదని పార్టీ నేతలు తరచూ వాపోయేవారు. ఈ సమయంలో.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టవడంతో లోకేశ్ తన పాదయాత్రను అర్థాంతరంగా నిలిపివేశారు. తనను కూడా అరెస్టుచేస్తారనే భయంతో ఢిల్లీ వెళ్లి అక్కడే మకాం వేశారు. ఆ సమయంలో పాదయాత్ర కొనసాగించాలని పార్టీ నేతలు ఎంత ఒత్తిడి చేసినా అరెస్టు భయంతో ఆయన జనాల్లోకి రాలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన తల్లి భువనేశ్వరితో తూతూమంత్రంగా 'నిజం గెలవాలి' పేరుతో ఒక కార్యక్రమం మొదలుపెట్టినా దానికీ ఆదరణ లభించలేదు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చాక లోకేశ్ తన పాదయాత్ర రూటుమార్చేసి, నడవలేక చేతులెత్తేసి చివరికి మమ అనిపించారు.

లోకేశ్ మంగళగిరికే పరిమితం..

ఈ పరిస్థితుల్లో.. లోకేశ్‌ను తెరవెనుక నుంచే ఎన్నికలకు పని చేయించాలని ముఖ్య నేతలు సూచించినట్లు సమాచారం. ఆయన పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంవల్ల నష్టమని వ్యూహకర్తలు కూడా తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో లోకేశ్‌ను ప్రస్తుతం మంగళగిరికి మాత్రమే పరిమితం చేశారు. ముఖ్యమైన పార్టీ కార్యక్రమాలకు సైతం ఆయన రావడంలేదు. చంద్రబాబు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమాలకు ఆయన దూరంగానే ఉంటున్నారు. ఇటీవల నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమానికి సైతం చిన్నబాబు దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో తాను పోటీచేసి ఓడిపోయిన మంగళగిరి నియోజకవర్గంలోనే ఆయన అడపాదడపా తిరుగుతున్నారు. అక్కడ డబ్బులిచ్చి కొందరు నాయకుల్ని మేనేజ్ చేస్తూ బిల్డప్ ఇచ్చుకోవడం.. చోటామోటా నేతలకు కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం, స్థానికంగా చిన్నపాటి సమావేశాలతోనే ఆయన సరిపెట్టుకుంటున్నారు. అది కూడా కొంత సమయం మాత్రమే. ఎక్కువగా ఆయన హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అయినా ఎమ్మెల్యేగా గెలవాలని సూచిస్తూ ఆయన్ను మంగళగిరిపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించేలా చేయడంలో పార్టీ నేతలు ఓ రకంగా సఫలమయ్యారు. తద్వారా లోకేశ్ గండం నుంచి ప్రస్తుతానికి గట్టెక్కామని వారు భావిస్తున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూసుకుంటూ కొంతవరకైనా పరువు నిలుపుకోగలిగామని సంబరపడుతున్నారు.

మొత్తం మీద యువగళం పాదయాత్రవల్ల టీడీపీకి మైలేజ్ సంగతి ఎలా ఉన్నా అభాసుపాలైన ఘటనలే ఎక్కువ జరిగాయి.

'ఇక్కత్'కు ఇక్కట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చేనేత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బ్రాండ్ ఇమేజ్‌పై దెబ్బ

పట్టుదారానికి రంగులద్ది డిజైన్‌లు కట్టి నేసే ఇక్కత్ పట్టు చీరకు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఈ చీరలకు మహిళల్లో విశేష ఆదరణ ఉంది. పోచంపల్లి కేంద్రంగా తయారయ్యే పట్టు చీరలకు అంతర్జాతీయంగా గుర్తింపు కూడా ఉంది. అలాంటి పట్టు చీరల డిజైన్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్ చేసి తక్కువ ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో చీర ధర పడిపోవడం, ఏది అసలీనో ఏది నకిలీనో గుర్తించలేకపోవడం, ఆన్‌లైన్‌లో మోసాలు జరగడం లాంటివి కూడా చోటు చేసుకుంటున్నాయి. గత రెండేళ్లుగా గుజరాత్‌లోని సూరత్ కేంద్రంగా పోచంపల్లి డిజైన్లతో ప్రింటెడ్ పాలిస్టర్ చీరలు బహిరంగ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ చీరలు రూ.600 నుంచి రూ.1000 లోపే లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆకర్షితులవుతున్నారు.

భారీగా పడిపోయిన అమ్మకాలు: ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో 12,000 మంది చేనేత కళాకారులకు జియో ట్యాగ్ ఉంది. అంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతినెలా ఒక జియో ట్యాగ్ కళాకారుడితోపాటు మరో ఇద్దరు అనుబంధ కళాకారులు ఉంటారు. అంటే సుమారు 36 వేల మంది నేరుగా వృత్తిలో ఉన్నారు. నెలకు ఒక చేనేత కుటుంబం ఐదు చీరలు తయారు చేస్తుంది. ఇలా తయారైన చీరలతో గతంలో నెలకు రూ. 40 కోట్ల వ్యాపారం జరిగేది. ప్రస్తుతం ప్రింటెడ్ చీరలు రాకతో రూ.20 కోట్లకు అంటే సగానికి సగం వ్యాపారం పడిపోయిందని నేతన్నలు చెబుతున్నారు.

మూట వ్యాపారం దాకా విస్తరణ: పోచంపల్లి ప్రింటెడ్ పట్టు చీరలు ఇప్పుడు గ్రామాల్లో మూట వ్యాపారం దాకా వచ్చాయి. గతంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లోనే లభించే ప్రింటెడ్ చీరలు ఇప్పుడు పల్లెల్లోనూ అమ్ముతున్నారు. ప్రింటెడ్ చీరల అమ్మకాలను అరికట్టాల్సిన యంత్రాంగం చేతులెత్తేయడంతో పోచంపల్లి చీరల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని స్థానిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రింటెడ్ చీరలను అదుపు చేయాలి



జీఐ పొందిన ఇక్కత్ చేనేత చీరలను పోలిన ప్రింటెడ్ చీరల తయారీని ప్రభుత్వం అరికట్టాలి. ఇటీవల పోచంపల్లికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రచనా సాహు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. గుజరాత్‌లో ప్రింటెడ్ చీరల తయారీని, షాపింగ్ మాల్స్‌లో అమ్మకాలను నిరోధించాలి. కల్యాణ లక్ష్మి నగదు సహాయంతోపాటు పోచంపల్లి పట్టు చీరను వధువుకు ఇవ్వాలి. ఇక్కత్ వృత్తిని కాపాడాలి.

– తడ్క రమేష్, చేనేత సంఘం నాయకులు, పోచంపల్లి

మాల్స్‌పై మరిన్ని దాడులు చేస్తాం

పోచంపల్లి పట్టు చీరలను పోలిన ప్రింటెడ్ చీరలు సూరత్ నుంచి వస్తున్నాయి. షాపింగ్ మాల్స్‌లో అమ్ముతున్నారన్న విషయాన్ని గుర్తించి దాడులు చేస్తున్నాం. ప్రతి డిజైన్‌ను కాపీతో ప్రింట్ చేసి చీరలను విక్రయిస్తున్నారు. చేనేత వృత్తిదారులకు ఇది తీరని నష్టం కలిగిస్తోంది. త్వరలో మరిన్ని దాడులు చేయబోతున్నాం.

– వెంకటేశ్వర్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

పాతబస్తీలో యువతిపై గ్యాంగ్‌రేప్

- రాత్రివేళ ఎంజీబీఎస్ బయట ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులు
- సోదరుడితో గొడవపడి సూర్యాపేట నుంచి వచ్చిన బాధితురాలు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడలో అమానుష ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో గొడవపడి రాత్రిపూట సూర్యాపేట నుంచి నగరానికి వచ్చిన ఓ యువతిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన చాంద్రాయణగుట్టలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన యువతి (21) తన సోదరుడు, తల్లితో కలసి అక్కడే ఉంటోంది. ఈ నెల 6న సోదరుడితో గొడవ జరగడంతో అతడు ఆమెపై చేయిచేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి.. సూర్యాపేటలో బస్సెక్కి ఎంజీబీఎస్‌లో రాత్రి 10:40 గంటలకు దిగింది. బయటకు వచ్చిన ఆమె టీ తాగి రోడ్డు దాటుతుండగా అటుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెను ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ఏదైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని యువతి తెలిపింది. అయితే తాము కూడా అటే వెళ్తున్నామంటూ బైక్ ఎక్కాలని కోరారు. అయితే తాను ఆటోలో వస్తానని చెప్పినా వినకుండా యువతిని బైక్‌పై ఎక్కించుకున్నారు. ఆపై సిద్దంబర్ బజార్‌కు తీసుకెళ్లి ఐస్‌క్రీమ్ తినిపించి చాంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గోడౌన్‌కు తీసుకెళ్లారు. ఆమెను కొట్టి బలవంతంగా ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి పాల్పడ్డాడు. వారి చెర నుంచి తప్పించుకున్న బాధితురాలు.. బయటకు పరుగుతీసి కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. దీంతో నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న బండ్లగూడ పోలీసులు అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో ఘటనాస్థలికి చేరుకొని బాధితురాలిని స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు స్వీకరించారు. కాగా, నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

'ఇందిరమ్మ'లోకి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు!

గత ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్లు దాదాపు 2.28 లక్షలు.. వాటిల్లో పూర్తయినవి 1.53 లక్షలు

గత బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలోకి మార్చి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని భావిస్తోంది. దాదాపు 1.23 లక్షల రెండు పడక గదుల ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో ఇందిరమ్మ పథకం కింద దరఖాస్తు చేసిన పేదలకు కేటాయించే దిశగా అడుగులు పడుతున్నాయి.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ పథకాల లబ్ధి కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. దాదాపు కోటికిపైగా దరఖాస్తులు రాగా, వాటిల్లో ఇళ్లకు సంబంధించే 15 లక్షలకుపైగా వచ్చి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే పూర్తయినవి కొన్ని, వివిధ దశల్లో ఉన్నవి కొన్ని, ప్రారంభించాల్సినవి కొన్ని.. ఇలా 1.23 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్నాయనేది అధికారుల లెక్క. వాటిని ఆయా ప్రాంతాల లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

బీఆర్‌ఎస్ పూర్తి చేసిన ఇళ్లు 1.53 లక్షలు..

పేదలకు దేశంలో ఎక్కడా లేని తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఉచితంగా అందించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తూ రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ పథకం కింద 2.90 లక్షల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించగా, 2.28 లక్షల ఇళ్లకు టెండర్లు ఖరారు అయ్యాయి. వాటిల్లో 1.53 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. వీటిల్లో నుంచి నగరం, శివారు ప్రాంతాల్లో 66 వేల ఇళ్లను, ఇతర జిల్లాల్లో మరో 40 వేల ఇళ్లను మొత్తంగా లక్షా 6వేల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంకా 47వేల ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఎవరికీ పంపిణీ చేయలేదు. ఇక నిర్మాణాలు పూర్తి చేసుకునే దిశలో మరో 40 వేల ఇళ్లున్నాయనీ, కాంట్రాక్టర్లతో అగ్రిమెంటు పూర్తి అయి, పనులు మొదలుపెట్టిన ఇళ్లు మరో 36 వేల వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఈ 1.23లక్షల ఇళ్లను ఇప్పుడు ఇందిరమ్మ పథకంలోకి మార్చి, తాజాగా అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పంపిణీ చేయాలన్న దిశలో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఇంకా రూ.నాలుగున్నర వేల కోట్లు కావాలి

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల యూనిట్ కాస్ట్ 5.40 లక్షల మేర ఉన్నందున ఈ ఇళ్ల నిర్మాణానికి భారీగా ఖర్చు అవుతోంది. ఇప్పుడు వివిధ స్థాయిలో నిలిచి ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ఇంకా రూ.4500 కోట్లు అవసరమని గృహనిర్మాణ మండలి అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. ఇందిరమ్మ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లతో పోలిస్తే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ వ్యయం కొంత ఎక్కువే అయినా, ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం భారీగా ఖర్చు చేసి ఉన్నందున మిగతా అసంపూర్తి ఇళ్లను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఇక కొత్తగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించే వీలు లేనందున ఉన్నవాటిని పూర్తి చేసి వాటిని వదిలించుకోవాలని భావిస్తోంది. ఆ ఇళ్లను పూర్తి చేస్తే వాటికి మంచి డిమాండే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అనుసరించిన విధానం ద్వారా ఈ ఇళ్లను కూడా కేటాయించాలని యోచిస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ పరీక్ష

- ఉమ్మడి జిల్లా నుంచి 574మంది హాజరు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న జేడీ, జేడబ్ల్యూ ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ ఏ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో భాగంగా ఉదయం 7గంటలకు క్యాడెట్లకు డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ వంటి అంశాలను ఎన్‌సీసీ అధికారులు పరీశీలించారు. అనంతరం విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. పరీక్ష సరళిని లెఫ్టినెంట్ కల్నాల్ లక్ష్మణ్ గణేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమర్థవంతంగా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. వారి ప్రతిభ ఆదారంగా సర్టిఫికెట్ ఏను ప్రధానం చేస్తామన్నారు. సుబేదార్ మేజర్ కూల్‌దీప్‌సింగ్, జేసీఓ జెర్నెల్ సింగ్, ఎన్‌సీసీ అధికారులు రామకృష్ణ, శంకరయ్య, లక్ష్మణ్, కనకప్ప, రాఘవేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

దోమకొండ సంస్థానంలో భైరోజుకు సన్మానం



వనపర్తి టౌన్: వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన వాఖ్యాత భైరోజు చంద్రశేఖర్‌ను దోమకొండ సంస్థానాధీశుడు, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కిషన్‌రావు ఘనంగా సన్మానించారు. కామారెడ్డి జిల్లా దోమకొండ సంస్థానంలో శనివారం రాత్రి నిర్వహించిన సదస్సుకు కొల్లాపూర్, ఆత్మకూర్, సీరణంపల్లి, ప్రాగటూరు, మునగాల సంస్థానాల వారసులు హాజరై ఆయా సంస్థానాల వైభవాన్ని, ప్రాముఖ్యతను వివరించారు. ఇదే క్రమంలో భైరోజు చంద్రశేఖర్ వనపర్తి సంస్థానం గొప్పతనాన్ని విపులంగా వివరించారు. దీంతో దోమకొండ సంస్థానాధీశుడితో పాటు ఆయా సంస్థానాల వారసులు భైరోజును సన్మానించారు. అదేవిధంగా గోపాల్‌పేట సంస్థానం గొప్పతనాన్ని అద్భుతంగా వివరించిన భైరోజు చంద్రశేఖర్ సోదరుడు శ్యాంసుందర్‌ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

సింగవట్నానికి బ్రహ్మోత్సవ శోభ

- ఈనెల 15నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ మండలంలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతోంది. ఈనెల 15నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులతో పాటు దేవాదాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 15న స్వామి వారికి ప్రత్యేక పూజలు, శకటోత్సవం నిర్వహించనున్నారు. 16న అశ్వవాహన సేవ, కల్యాణం, 17న ప్రభోత్సవం, 18న రథోత్సవం నిర్వహించనున్నారు. 19న శ్రీవారి సముద్రంలో తెప్పోత్సవం, 20న శేషవాహన సేవ, 21న హంసవాహన సేవ నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేయడంతో పాటు గుండాన్ని శుభ్రపరిచారు. శ్రీవారి సముద్రం కట్టపై లైట్లు ఏర్పాటు చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న రత్నగిరి కొండపై వెలసిన అమ్మవారి ఆలయాన్ని కూడా బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాల అనంతరం దాదాపు నెల రోజులపాటు జాతర కొనసాగనుంది.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం



21 నుంచి ఆలిండియా క్రికెట్ టోర్నీ



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

- ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ వెల్లడి

అచ్చంపేట రూరల్: నల్లమల క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో రాణించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ కోరారు. ఈ నెల 21 నుంచి అచ్చంపేట ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగే ఆలిండియా క్రికెట్ టోర్నీ నిర్వహణపై ఆదివారం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు స్టేడియంలో వసతులు పరిశీలించి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి నిర్వహించే ఆలిండియా క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్, ఈ నెల 30న ముగింపు కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న క్రీడాకారులకు ఆర్థికసాయం అందించి క్రీడల్లో రాణించేలా తోడ్పాటునందిస్తామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కపిలవాయి చంద్రమోహన్, గోపాల్‌రెడ్డి, గిరివర్ధన్‌గౌడ్, చంద్రశేఖర్, రఘు, ఖాదర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

కొండనాగులలో..

బల్మూర్ మండలం కొండనాగులలో క్రికెట్ లవర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్‌లీగ్ సీజన్–3 టోర్నీని ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సగరులలో సామాజిక చైతన్యం రావాలి



భవిష్యత్ ప్రణాళిక కరదీపిక విడుదల చేస్తున్న సగర సంఘం నాయకులు

- గద్వాల అదనపు కలెక్టర్ శ్రీనివాసులు
- నాగర్‌కర్నూల్‌లో నగర సేవా సమితి ఆవిర్భావ సభ

నాగర్‌కర్నూల్: సగరులు ఐక్యతతో ముందుకు వెళ్తేనే విద్య, వైద్యం, ఆర్థిక, రాజకీయాల్లో ఎదుగుతారని.. ఇందుకోసం మనలో సామాజిక చైతన్యం రావాలని జోగుళాంబ గద్వాల అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో సగర సేవా సమితి ఆవిర్భావసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి భవిష్యత్ ప్రణాళిక కరదీపికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాలు, పట్టణాల్లో అందరికీ ఇల్లు నిర్మించి ఇస్తున్నా సగరులకు సొంతిళ్లు లేవని వాపోయారు. నాయకత్వ లోపం, ఐక్యత లేకపోవడం వల్లే ముందుకు ఎదగలేకపోతున్నామని చెప్పారు. సంస్కారంతో కూడిన చదువు ఉంటే మనం ఆర్థికంగా కూడా ఎంతో అభివృద్ధి సాధిస్తామన్నారు, శ్రీరాముడి వంశానికి చెందినవారమని, భగీరథ వారసులమని గొప్పగా చెప్పుకుంటున్నామే గానీ మనకు సమాజంలో సరైన గుర్తింపు లేదన్నారు. ఎన్ని సంఘాలు వచ్చినా సామాజిక స్థితిగతులు మారడం లేదన్నారు. వీటికి భిన్నంగా 'మన కోసం.. మన పిల్లల భవిష్యత్ కోసం' అంటూ ఓ మంచి ఆలోచనతో ఇలాంటి సేవా సమితిని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ పి.రవీంద్రసాగర్ మాట్లాడుతూ ఐక్యతలో ఎంతో గొప్పతనం ఉంటుందని పేర్కొన్నారు. నిరుపేద సగరులకు భరోసా, భద్రత ఇచ్చేందుకు ఇంతమంది విద్యావంతులు, మేధావులు ఒకవేదిక మీదకి రావడం శుభపరిణామమని, సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అసోసియేట్ ప్రొఫెసర్ వేముల శ్రీనివాసులు, సీఐ చీర్ల శ్రీనివాసులు, ఉమ్మడి పాలమూరు జిల్లా బీసీ సమాజ్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, సగర సంఘం నాయకుడు ప్రేమ్‌సాగర్ తదితరులు మాట్లాడి దిశానిర్దేశం చేశారు.

జిల్లా కార్యవర్గం ఎంపిక

నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, కోశాధికారిగా సురేష్‌బాబు, గౌరవ అధ్యక్షులుగా రిటైర్డ్ పోస్టుమాస్టర్ సి.నర్సింహ, మురళీకృష్ణ, ఏ.రఘు, ఉపాధ్యక్షులుగా శైలజ, గోవర్ధన్‌సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సి.బాబయ్య, పి.రాజశేఖర్, ఎ.చెన్నయ్య, చిరంజీవి, కార్యదర్శులుగా లక్ష్మణ్, శేఖర్, అరుణ్‌కుమార్, రవి, ప్రచార కార్యదర్శులుగా గిరిబాబు, సుధాకర్, యుగంధర్, కార్యనిర్వాహక సభ్యులుగా గోపిలత, శేఖర్, సి.శివకుమార్, రామకృష్ణ తదితరులను ఎంపిక చేశారు.

అణచివేతకు గురిచేయడం నియంతృత్వమే

- ప్రొ.హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొ.హరగోపాల్

గద్వాల అర్బన్: భావప్రకటన స్వేచ్ఛ లేకుండా ప్రజల్ని అణచివేతకు గురి చేయడం నియంతృత్వమేనని, ప్రజలు నియంతృత్వాన్ని ఎక్కువ కాలం సహించరని చరిత్ర మళ్లీ రుజువు చేసిందని ప్రొ.హరగోపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛ కుచించుకుపోదని, అది మరింత చైతన్యవంతంగా మనిషి తన శక్తి సామర్థ్యాల్ని సమాజ ప్రగతి కోసం అవధులు, భయం, అణిచివేత లేకుండా ఉపయోగించుకోవడం జరగాలన్నారు. ప్రజాస్వామ్యం పునరుద్ధరణ అంటే ఎన్నికలు మాత్రమే కాదు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘటితం చేస్తూ ఆ సమస్యల పరిష్కారం కోసం మార్గాలను అన్వేషించడం నిజమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ అన్నారు. నిరర్థక ప్రాజెక్టు అయిన చిన్నోనిపల్లి రిజర్వాయర్ ఎత్తివేసే విధంగా కొత్త ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష, కో–కన్వీనర్ హనుమంతు, గోపాలరావు మౌలాజీ రావు, రామచంద్ర, నాగన్న తదితరులు ఉన్నారు.

పురాతన ఆలయాల పరిరక్షణ బాధ్యత

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

జడ్చర్ల: పురాతన ఆలయాలు, శిల్ప కళాఖండాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా. ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లిలోని శివాలయం, చెన్నకేశవ ఆలయాన్ని ఆయన సందర్శించి అక్కడి పరిసరాలు, చారిత్రక శిల్పాలు, శాసనాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాల్లో నిలువెత్తు భైరవ విగ్రహంతో పాటు ఓరగల్లు శిల్పాలు, కాకతీయుల కాలం నాటి వినాయకుడు, కార్తికేయ, సప్తమాతల శిల్పాలు, భిన్నమైన చెన్నకేశవ విగ్రహం ఉన్నాయన్నారు. వీరభద్రుడి ఆలయం వద్ద క్రీ.శ. 1099వ సంవత్సరం జూలై 18 సోమవారం నాటి శాసనం మట్టిలో కూరుకుపోయి ఉందని వివరించారు. పోలేపల్లి చెన్నకేశవ త్రికూట ఆలయాల చుట్టూ ముళ్లపొదలు ఏపుగా పెరిగాయని, గ్రామ చరిత్రకు అద్దం పడుతున్న వారసత్వ కట్టడాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా చారిత్రక శిల్పాలతో పాటు శాసనాలను భద్రపర్చాలని సూచించారు. ఆయన వెంట మాజీ వీఆర్‌ఓ బిచ్చన్న, స్థపతి భీమవరపు వెంకట్‌రెడ్డి, వేయిగండ్ల ప్రణయ్ శిల్పి తదితరులు ఉన్నారు.



శిల్పాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

ఇథనాల్ పరిశ్రమలు మూసివేయాలి

- టీపీఎఫ్ జిల్లా సమన్వయకర్త పి.బిచ్చారెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నారాయణపేట జిల్లా చిత్తనూర్, నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ సమీపంలో ఏర్పాటుచేసిన ఇథనాల్ పరిశ్రమలను వెంటనే మూసివేయాలని టీపీఎఫ్ జిల్లా సమన్వయకర్త పి.బిచ్చారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని.. ఇథనాల్ పరిశ్రమల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు శాంతియుతంగా పోరాటం చేస్తుంటే పరిశ్రమల యజమానులు పోలీసులతో కుమ్మక్కై లాఠీచార్జ్ చేయించి అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. న్యాయ విచారణ జరిపించి ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని పేర్కొన్నారు.